


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**ఆ భరోసా** ఇచ్చినందుకు ఆమెను ముద్దుపెట్టుకోవాలనిపిపించింది. కళ్ళుమూసుకుని ఆమె మీదికి వొంగి ఆ పని చేయబోయాడు. చేత్తో తోసేసింది, కాలితోబాగుండదని.

"నీవు పెళ్లి చేసుకుందామన్నా నిర్ణయానికి వచ్చావని తెలిస్తే నీతో ఇక సంబంధం ఉండదని కృపకు చెప్పి నా సంసారాన్ని నిలుపు కునేదానినేమో, అనంతం."

అతను గతుక్కుమన్నాడు. తేరుకున్నాడు.

"కృపా వెళ్లి నెలరోజులవుతుంది. ఆ తరువాత నా పెళ్లి నిర్ణయం వగైరా జరిగాయి, సుమతి. నమ్ము."

"నమ్మకపోతే ఇబ్బందుందా?"

"అపరాధభావం వెన్నంటుతుంటుంది నీడలా."

“అపరాధభావానికి సున్నితమైన మనసులోనే స్థానం ఉంటుంది; నీడ వేధించదు."

"నిజం. నీ మనసంత సున్నితమయినదికాదు నా మనసు. కానీ రాతిలోనూ నీరుండకపోదు."

అతను వెళ్లిపోవడానికి లేచినిలబడ్డాడు.

ఆమెకు అతను దూరమయిపోతున్నాడన్న భావన విచారం కలిగించింది.

ఆఖరిసారిగా అతను తననుఅతను ఊళ్లోకి తీసుకుంటే బాగుండు అనిపించింది. ఇద్దరు వ్యక్తులతో సుఖపడాలని చూసింది; ఇద్దరువ్యక్తులవల్లా నరకం అనుభవిస్తోంది.

"నీవొస్తే ఎంతో సంతోషిస్తా," అన్నాడు ఆమె రాదనీ నమ్మినా.

"పిచ్చి వెన్నెల!'

అతనన్నదానికి సమాధానం అవసరమా కాదా అని రెండు నిముషాలు ఆలోచించింది; సమాధానం ఇద్దామని నిర్ణయానికి వచ్చిన తరువాత ఏ సమాధానం ఇవ్వాలి అని ఒక క్షణం ఆలోచించింది.

"అవును. వెల్లివిరిసే వెన్నెల; వెండి వెన్నెల; మిడిసిపడుతోంది."

మీటిన తీగలా ధ్వనిస్తోంది ఆమె స్వరం. దాంట్లో గంజాయి మత్తుంది,

"మనలాగే. మల్లెల వెన్నెల అని కూడా అందాము; మనం ఏమన్నా అదేమీ అనదు. మూగది. నిజానికి నోరే లేనిది," ఆమె తలనంతా ఆక్రమించిన మల్లెలను చూస్తూ అన్నాడు.

"వెన్నెల గురించీ చెప్పడానికి ఉపమానాలు లెక్కలేనన్ని."

"వెన్నెల గురించీ చెప్పడం అనవసరం; అనుభవించాలి."

"గ్లాసులో పోసుకుని మద్యంలా తాగా, దాంట్లో దొర్లా?"

"తినబోతూ రుచి గురించీ చర్చ అనవసరం."

"తొందరగా ఉందా?"

"అస్సలు లేదు," తనలో తాను నవ్వుకుంటూ అన్నాడు."

"వింతే!"

"మనం  వింతలుగా భావించేవి చాలామటుకు కావు," అతను లోపలి నవ్వును పైకి తెచ్చుకుని అన్నాడు.

వింతలు వింతగా కనిపించనంతటి విస్తృతమైన జీవితాన్ని చూసి, అనుభవించి ఉంటారేమో."

"ఇవే క్షణాల వెన్నెల స్మశానంలో, గోరీల మీద, ఆకలికడుపులమీదా, చెట్టుకు ఉరేసుకుంటున్నవాళ్ళ మీద, మురికి కాలువల మీద, నాలాటి నేరస్థుల మీద కాస్తుంటుంది. దానిది  సమదృష్టి. దాన్ని చూసి భ్రమలకు గురవుతున్నాము మనం"

"శృంగార సమయంలో వైరాగ్య వైఖరికి, వైరాగ్య సమయంలో శృంగార వైఖరికి అలవాటుపడ్డారా ఏమిటి?"

'నీలో వైరాగ్య ధోరణికి చోటులేదేమో," చిలిపిగా  అన్నాడు.

"నాలో రెండూ పిలిస్తే వస్తాయి సమయానుకూలంగా."

"శృంగారాన్ని పిలిచెయ్యి, మంచం ఎక్కుదాము."

"మీకు సిగ్గు కొంచం తక్కువా?"

"చాలా తక్కువ."

"వెన్నెల నుంచీ మన సంభాషణ మొదలయింది; సిగ్గుకు చేరుకున్నాం. పూవును చూసి, ఆఘ్రాణించి వదిలేయ్యాలిగాని చిదిమి వాసనచూస్తే పసరువాసనకొడుతుంది."

“నువ్వు తెలివైనదానివని అర్థంచేసుకున్నా. నాకన్నా తెలివైనదానివేమో అన్న భయం కలుగుతున్నది."

"దుర్మార్గానికి భయపడాలిగాని తెలివితేటలూ చూసి కాదు. మీది భయం సమస్యా, అహం సమస్యా?"

"మీ నాన్న గారి ఆస్తుల మొత్తం విలువ ఏపాటి ఉంటుంది?"

"కనుక్కుని చెప్పమంటారా?"

"ఇంత పెద్ద భవనాన్ని మన మొదటి రాత్రికి కేటాయించారంటే  చాలా ఆస్తిపరుడై ఉండాలని అనిపించి అడిగాను. ఎలాగూ ఆస్తి మొత్తం ఆయన తదనంతరము నీదే కదా."

"నాది మీది కూడా అని మీకు తెలుసు.నాకు ఆస్తిపాస్తుల మీద పెద్దగా మోజులేదు. ముచ్చట్లతో రాత్రి కరిగిపోతోంది; వెన్నెల చిన్నబోతోంది. కాస్త చలిగా ఉంది."

"అలిసిపోయియుంటావు."

"అయింది పెళ్లి. బరువులుమోసె పని కాదు."

"ఐదు గంటల వివాహం అలసట కలిగించదూ?"

ఆమె మౌనం దాల్చింది. ఆమె వెన్నెలనీడలో పెట్టుకున్న పూలు, కట్టుకున్న ఖరీదైన చీర, పాములా వేలాడుతున్న పూలజడ, కదుపుతున్న పొడవాటి సుతిమెత్తని వేళ్లూ, బద్ధకంగా మూతలుపాడే కనురెప్పలూ చూస్తున్నాడు. ఆమె తనకు ఒక మిస్టరీ; తాను ఆమెకు అదే. కలిసి జీవించడం శృంగారంతో మొదలవబోతోంది.

"లోపలి పోదాం," అతను లేస్తూ అన్నాడు.

ఆమె చేతిని పట్టుకున్నాడు. ఇద్దరూ లోపలి నడిచారు.

అతను గంట క్రితం తన మెడనుంచీ తీసి బల్లమీద పడేసిన పూలమాల ఉరిలా తోచింది అతనికి.

## 10. అవతారం

రెండు ఎకరాల ఆవరణలో అతి స్వల్పకాలంలో ఎక్కడో కట్టి ఇక్కడికి తెచ్చినట్టు ఏర్పడింది ఆశ్రమం. దానిలో స్వామికి ఒక సౌధం కూడా కలదు. రాత్రిపూట చడీచప్పుడూ ఉండదు. అతిముఖ్యమైన భక్తులుండటానికి గదులున్నాయి. తొమ్మిది తరువాత గదులలో దీపాలు వెలిగి ఉండటానికి వీలులేదు. ఎనిమిదికల్లా భోజనాలు ముగిసిపోవాలి. ఎవరూ పగలే కానీ, రాతిరేకానీ స్వరాన్ని అవసరమైనదానికి ఏమాత్రం మించి మాట్లాడటానికి లేదు. ఆ నిశ్శబ్దంలో ఖాతరుచెయ్యని పక్షుల రవాలు వినిపిస్తాయి. వాటిని అదుపు చెయ్యడం స్వామికి అసాధ్యం కాదు; పట్టించుకోరు. కావాలనుకుంటే కౌశికుడిలా కన్ను తెరచి దగ్ధం చేయగలరు. తన మహిమను ప్రతిదానికీ ఖర్చుచేయడం స్వామికి ఇష్టం ఉండదని ఒక వీర భక్తుడన్నాడు, స్వామి అతగాడి చెవిలో ఊదినట్లు. సాటి భక్తులు ఆ భక్తుడిని అధిక గౌరవంతో

నిమిషంపాటు చూశారు. భజనలకు ఆ ఆశ్రమంలో చోటులేదు. మౌనం ద్వారా ఎన్నో అచ్చటలూ, ముచ్చటలూ చెప్పుకోవచ్చని స్వామి ఒక ఉపన్యాసంలోవెల్లడి చేశారు. అది అసాధ్యమని అనుకోరాదని, సాధన ద్వారా సాధించలేనిది ఏమీ లేదని మరోసారి ఉపన్యాసంలో వారే వక్కాణించారు. ఆయన నోటి నుంచీ వెలువడిన ప్రతి పలుకు రికార్డు చేయబడింది. అక్షర రూపంలో భక్తులకు అమ్మబడింది.

ఆ ఆజానుబాహువు చూపు మరోలోకంలోకి చూస్తున్నట్టుంటుంది ఈ లోకాన్ని పట్టించుకోనట్టు. నల్లటి, తెల్లటి కలనేత జుట్టు ఒత్తుగా పెరిగి మెట్లుమెట్లుగా నెత్తి నుంచీ, చెవుల మీదుగా రక్షణగా ఉన్నట్టు వేలాడుతుంటుంది. గడ్డంకొన పైకి ఒంపు తిరిగి హెచ్చరిస్తుంటుంది, ఏమానో! గడ్డం, మీసాల మధ్య ఎర్రటి పెదవులు తొంగి చూస్తుంటాయి ఈ లోకాన్ని. అవి విడివడినపుడు పలు వరుసలు తళుక్కుమని అర్థరాత్రి చుక్కల్లా మెరుస్తుంటాయి. నల్లికీచు నాలుక బైటికి అప్పుడప్పుడూ వచ్చి గాలి రుచిని చూసి లోపలి వెళుతుంటుంది. అతను స్వరం పురి విప్పితే భక్తులు మైకంలోకి వెళ్ళిపోతారు. అర్థమయినా కాకపోయినా మంత్రాలకు మహిమ ఉన్నట్టు నమ్మినట్టే ఆయన పదాలకు మహిమ ఉండకపోదు అని భక్తుల నమ్మిక. ఆయన మాట్లాడుతుంటే మేఘసమూహం ఉరుముతున్నట్టుంటుంది ఒకసారి, కరుణాసముద్రం రొదచేస్తున్నట్టుంటుంది, ఇంకొకసారి మాట్లాడేటప్పటి ఆయన నవ్వు వెన్నెలను చిలికిస్తున్నట్టుంటుంది. ఆ నవ్వును చూసే భాగ్యం పున్నమికో అమావాశ్యకో మాత్రమే కలుగుతుంది.

విచారం ఆయన గుండె గూడుగా నెలకొని ఉందా అన్న అనుమానం సూక్ష్మగ్రాహులకు అనిపించవచ్చు. బుద్ధుడిని ఇతరుల కన్నీరు కదిలించినట్టు ఈ లోకం ఇలా ఉందేమీ అన్న బాధా అది? మరో కారణమేమన్నా ఉందా? ఆయన స్వరం మోగుతున్నంతసేపూ వాళ్ళ కష్టాలను మరిచి పోతారు; వాళ్ళ గుడ్డినమ్మకమే కావచ్చు, నిజంగా ఆయన మహిమే కావచ్చు.

ఆయన వయసెంతో ఎవరూ అంచనా కట్టలేకపోయారు. సిద్ధపురుషుడి వయసెంతో చెప్పడం అసాధ్యం అని కొందరి భావన. ఆయన గాంభీర్యం చకితులను చేస్తుంది. అతనొక్కొకసారి చూపే కారుణ్యం కన్నీరుతెప్పిస్తుంది ఆయనకూ, ఇతరులకూ. కొందరు భక్తులు, ఆయన మనలా మనిషి కాదు; మానవరూపంలో కనిపిస్తున్న మానవాతీత శక్తి అంటారు. ఒక భక్తుడి మాటకు మరొక భక్తుడు వంత పాడతాడు. ఒక్కొక భక్తుడు ఒక్కొక కొత్త విషయాన్ని స్వామిలో గ్రహించి మిగతా వాళ్ళతో ప్రసాదంలా పంచుకుని గర్వపడతాడు. ఒక్కొక కొత్త భావన పంచబడిన వెంటనే ఆయనంటే ఆ సమాజంలో భక్తిప్రపత్తులను అధికంచేస్తుంది.

ఇంతకూ ఈ ఊర్లో స్థిరపడటానికిగల కారణమేమిటి? ఎక్కడి నుంచీ వేంచేశారు. ఆకాశం నుంచి రాలిపడ్డారా ఉల్కలా? ఆయన గతం ఏమిటట? ఆయన తల్లిదండ్రులెవరూ? బంధువులు లేరా? సన్యసించడానికి గల కారణాలు ఏమయ్యుంటాయి?

“మిగతా విషయాలు మనకేలా? పంకిలంలో పుట్టినా పుష్పం పుష్పమేగదా.”

"మహిమలు చూపి నేను భక్తులను పోగేసుకోను. నాకు భక్తుల అవసరం లేదు; భక్తులకే నేను అవసరం. నా ద్వారా ఏదో పొందాలనే ఆశతో గాక ఏమీ పొందలేము అని ముందుగా తెలుసుకుని నా చెంతకు రండి," అని ని ఒకసారి ఆదేశించారట.

ఆయన పాదాలను ఎవరినీ ముట్టుకోనివ్వడు అవి ఏ అప్సరస విలువైన కుచములో అన్నట్లు. ఆశ్రమంలో గంట పచార్లుచేస్తే మాయరోగాలు తగ్గుముఖం పడతాయని ప్రచారం జరిగింది; కలిగే కష్టాలు గాలిలో కలిసిపోతాయాని ఎవరికీ వారు నమ్మడం కద్దు. అలా పచార్లు చెయ్యడానికి ఆయన రుసుము వసూలు చేయడు. ఆశ్రమం వృక్షాలమయం. మామూలుగా నెల రోజులలో మిగతాచోట్ల ఎదిగే మొక్కలు అక్కడ వారంరోజుల్లో ఎదుగుతాయట. ఆశ్రమంలో క్రింద రాలిన పండుటాకులు, పూరేకులూకూడా ఎవరూ పట్టుకెళ్ళడానికి వీలు లేదు. హెచ్చరికల ఫలకాలున్నాయి. ఆశ్రమపు మన్నును నుదుటికి రాసుకుంటారు కొందరు ఏదన్నా మహిమ ఉండవచ్చు అన్న ఉద్దేశంతో. డబ్బిమ్మని స్వామీ నోరు తెరిచి అడగడు. అడిగితే ఆకాశమే వానలా కురిపించగలదు. భక్తులను సంతోషపెట్టడానికి వాళ్ళంతట వాళ్ళేంతిస్తే అంత డబ్బాలో వేసేసుకోవచ్చు.

ప్రత్యక్షమైన ఇంత తక్కువ కాలంలో అంతమంది దృష్టిలో పడటం ఆయనగొప్పే కానీ వేరు కాదు అన్నారు కొందరు. నమ్మలేకపోయినంతలో ఈ సృష్టిలో వింతలూ లేవని ఎలా అనగలం? ఈ సృష్టి గురించి మనకు తెలిసింది ఆవగింజలోఅరవయ్యో భాగమే కదా. మోసం చేస్తారనీ రాజకీయనాయకులను మీదికెక్కించుకోటంతో పోలిస్తే బాబానో, స్వామినో నమ్మి మోసపోవడం తక్కువే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, ఒకనాడు వింతలుగా పరిగణించవలసినవి వింతలు కాకుండా మారిపొయ్యినపుడు ఒక వ్యక్తిలో అనూహ్యమైన శక్తులున్నాయంటే నమ్మటం మానెయ్యనక్కరలేదు.

స్వామి ఒక్కొక్క పదాన్ని తడబడకుండాను, పదం పదం మధ్య ఎక్కువ, తక్కువ కాని విరామంతోనూ హిప్నోటైజ్ చేస్తున్నట్టు గానూ మాట్లాడతారు. ఒక్కొక ముక్కా వినేవాళ్ళ మనసులలోకి చొచ్చుకుపోయి గింజలా నాటుకుని వృక్షాలవాలన్నట్టూ – గాంభీర్యంతో, హాలంతా ప్రతిధ్వనించేలా మాట్లాడతారు. పిరికి గుండెలు అవిసిపోతాయి,

ఆయన ఎప్పుడుపడితే అప్పుడు ఉపన్యాసాన్ని అందుకోరు. వాయిద్యాన్ని మీటబోయే ముందు శ్రుతి చేసుకుని సిద్ధం చేసినట్టు. ఒక్కోసారి ప్రవచనం, ప్రవచనం మధ్య రెండు నెలల కాలం గడిచిపోవచ్చు. భక్తులు చకోరాలవ్వొచ్చు. ఒక ఉపన్యాసం లేక ప్రవచనం స్వామీ ఇప్పుడే ఆరంభించారు. దాని ముందు ఆయన నమస్కారాలు, ప్రార్థనలకూ దిగరు. కొందరు ఆయన "నాస్తిక స్వామి" అని వెక్కిరిస్తారు.

"అగ్నిహోత్రంలో కూడా కొందరికి మలినం, మచ్చ కనిపిస్తాయి. అగ్నిహోత్ర లోపం కాదు; చూసే కళ్ళలోపం," అన్నారొక సారి.

ఆయన ప్రవచనంలో హంతకుడి కసి వినిపిస్తోందని ఒక అభిప్రాయం. ఇక విందాం:

సత్యం వద, ధర్మం చెర అనింది తైత్తరీయం సత్యాన్నీ, ధర్మాన్నీ వేరువేరుగా చూస్తూ. అదే శ్లోకంలో 'సత్యాత్ న ప్రమాదితవ్యం' అని చెప్పబడింది. అంటే సత్యవచనాన్ని పొరబాటునకూడా వదలవద్దు అని. ధర్మాన్ని కూడా అశ్రద్ధ చేయవద్దూ అంటుంది. ముండక ఉపనిషత్తు 'సత్యమేవ జయతే' అని ఊరుకోక జయించేది 'నానృతం' కాదు అని నొక్కి వక్కాణిస్తుంది. సత్యం ద్వారా 'దేవయాన' అన్న పథం వేయబడి తద్వారా కోరికలు లేని ఋషులు  పరమసత్యమైన పరమాత్మ అనే నిధిని చేరతారట. సత్యం, ధర్మముల సరిహద్దును బృహదారణ్యక అన్న ఉపనిషత్తు చెరిపివేస్తూ అంటుంది ఇలా: 'ధర్మం అంటే సత్యం; కావున వ్యక్తి సత్యం పలికినపుడు ధర్మం అతను మాట్లాడుతున్నాడు అంటారు. భారతంలో ధర్మవ్యాధుడికి, ఆ కసాయి కానీ కసాయికి, ఆ పేరు ధర్మాన్ని పాటించడం వలెనే  చేకూరి ఉండవచ్చు. గమనించవలసిన విషయం, 'నేను మాంసం అమ్ముతానేగాని జీవులను వధించను అని ఆయన కౌశికుడితో అంటాడు. ధర్మానికి సత్యం, అహింస రెండు మూల స్తంభాలు అంటాడు. ఆ రెండు ఒకదానితో మరొకటి తలపడినపుడు ఏది ముఖ్యమైనది అన్న ప్రశ్నకు ధర్మవ్యాధుడు సమాధానం ఇస్తాడు. సత్యం మాట్లాడటం వలన ఏ జీవైనా బాధపడేట్లయితే అనృతం పలకడం తప్పుకాదు అంటాడు. అంటే అహింసకు పెద్దపీట, సత్యానికి చిన్నపీట వేసినట్టుగా నిరభ్యంతరంగా భావించవచ్చు. ఆ సంస్కృత శ్లోకమిది:

అహింసా సత్యవచనం సర్వభూత హితమ్ పరమ్
యద భూతాహిత మత్యంతమ్
తత్ సత్యమతి ధారణా

అసలు సత్యం అంటే ఏమిటి? వ్యావహారికంగా లేక సామాన్యార్థకంగా అసత్యం కానిది సత్యం. సత్యం కానిది అసత్యం. మాకు తెలుగు అధ్యాపకుడిగా దీక్షితులు గారు అనే సంస్కృత పండితుడు ఉండేవాడు; వ్యాకరణానికి వచ్చేవాడు. కుర్చీలో హాయిగా కూర్చుని పావుగంట పాఠం చెప్పడమంటే ఆయన నెత్తిమీద టన్ను బరువుపెట్టి మోయమన్నట్టు. పగలైనా ఆయనకు పిలవకుండా నిద్రవచ్చేది; ఊర్మిళాదేవి తండ్రి అన్నట్టు.  సకర్మకక్రియ అంటే, అకర్మకక్రియ కానిది అట. అకర్మకక్రియ అంటే సకర్మకక్రియ కానిది – భార్య అంటే భర్త కానీ వ్యక్తి, భర్త అంటే భార్యకాని వ్యక్తి అన్నట్టు. రెండేళ్ళూ ఆయన కాళ్ళు జాపుకుని సుఖపడ్డాడు. మాకు వ్యాకరణం అన్నమాటకూడా రాయడం చేతకాలా. అలా సత్యం కానిది, అసత్యం ... ఇలా చెబితే చెప్పే నాకు అది సుఖం కానీ, వినే మీకు చాలా కష్టమది. సత్యం గురించి చెబుతూ అర్ధసత్యాన్ని  బోధించినవాడినవుతాను. సత్యం అంటే ఉన్నదాన్ని ఉన్నట్టుగా, నేను ఎలా దాన్ని తెలుసుకుని ఉంటే అలా చెప్పడం. అసత్యం అంటే లేనిదానిని ఉన్నట్లుగా చెప్పడం; ఉన్నదాన్ని లేనట్లుగా చెప్పడం.  ఒకవేళ బ్రహ్మ లేదని నాకు తిరుగులేని విధంగా తెలిసినా ఉంది అని చెప్పడం అబద్ధం – దానివల్ల లాభం ఉన్నా లేకున్నా. ఇక్కడ ఒక పేచీ ఉంది.

సత్యాన్ని సత్యంగా, అసత్యాన్ని అసత్యంగా గ్రహించలేకపోవచ్చు. గ్రహించలేదన్న విషయం ఆ వ్యక్తి గ్రహించకపోవచ్చు. అప్పుడు చెప్పేది అది కావాలని చెప్పని అబద్ధం.

అర్థసత్యం విషయంలో మనం తికమక పడక్కరలేదనుకుంటా. ధర్మరాజు అర్థసత్యంచెప్పాడు; పైగా అలాచెబుతున్నానని అతనికి తెలుసు. అది కేవలం అక్షరాలా అర్థసత్యం కావచ్చుగాని అచ్చంగా, సంపూర్ణంగా అది అబద్ధం. పైగా ఒక వ్యక్తి చావు బతుకులకు సంబంధించినది. అది వేయి ఏనుగులంతా అబద్ధం. గురువును హత్యచేయించినంత నిజం. అక్కడ నమ్మిక స్వభావం అన్న విషయం కూడా తలయెత్తుతుంది. ఏదైనా అబద్ధం, నిజం చెప్పినపుడు అది ఆడినవాడి విశ్వసనీయతను కూడా లెక్కలోకి తీసుకోవలసి వస్తుంది. భీముడు అశ్వత్థామ అన్న ఏనుగును చంపి ద్రోణుడి కొడుకు చచ్చాడు అన్న అర్థం వచ్చేట్లు అబద్ధమాడినా ఆ ముసలాయన నమ్మలేదు. దేవుడని తెలిసినా ఆ విషయంలో అబద్ధమాడిన కృష్ణుడిని కూడా ద్రోణుడు నమ్మలేదు. ధర్మరాజు విశ్వసనీయుడు అని ఆయన భావించడం వలన రాజు చెప్పిన అబద్ధాన్ని నమ్మి అస్త్రసన్యాసం చేయడం, హత్యచేయబడటం జరిగింది. నమ్మిక ద్రోణుడికి ప్రాణాంతకంగా పరిణమించింది అది కేవలం సత్యాసత్యాల రూపమే కాదు మోసంగా రూపాంతరం చెందింది. నమ్మించగలగడం ధూర్తలక్షణం, కానీ ఎవరినో కొందరినైనా కొంతమేరకైనా నమ్మడం, వాళ్ళు సాధారణంగా అబద్ధం చెప్పరనుకోవడం మానవుడి జీవనానికి ఒక అవసరం; ఒక ఆదర్శం కాకపోవచ్చుగాని. మనలను నమ్మనివాడి దగ్గిర సత్యం బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అలా అని అసత్యాన్నీ వాడు నమ్మడు. అసలు వాడు అడిగినా ఏదీ చెప్పకపోవడం సరైన చర్య. అవతలివాడు నమ్మినా నమ్మకపోయినా నేను సత్యమే పలుకుదును అని సత్యాన్ని పలకడం ఒక మతంగా, ఒక వ్యసనంగా భావించినప్పుడు ఆ పని చేయవచ్చు. నిష్కామ కర్మ. అబద్ధమైనా, సత్యమైనా నీవు నీతో పలకవు మరో వ్యక్తితో పలుకుతావు. suppressio veri అనే పదం లాటిన్ లో ఉంది. దానర్థం సత్యాన్ని అణిచిపెట్టడం. అలాంటిపని యుధిష్ఠరుడు చేశాడు. అది మన న్యాయశాస్త్రం ప్రకారం అసత్యంతో సమానం.

'సాధించెనే మనసా ... బోధించిన సన్మార్గ వచనముల బొంకు చేసి తాపట్టిన పట్టు ... సమయానికితగుమాటలాడెనె,,," అంటూ త్యాగయ్య నిందాస్తుతికి పాల్పడ్డాడు. అలాంటి బొంకులు పెద్దగా పట్టించుకోకూడదేమో మరి. ఆలా ఆడటమూ బొంకుతో సమానమని మనం వేరే చెప్పుకోనక్కరలేదు. దేవుడికే లౌక్యం అవసరమైన ఈ లోకంలో మానవ మాత్రులం కుండలు బద్దలుకొడుతూ నిజాలు పలకడం అ సాధ్యం. సత్యసంధులం మనం అని చెప్పుకుంటే మనం అగ్నిపరీక్షలకు సిద్ధపడాలి హరిశ్చంద్రుడిలా. ఆయనతోపాటు ఆయన భార్య, కొడుకు నానా అగచాట్లకూ గురయ్యారు; ఆయనతో వాళ్లకు సంబంధం ఏర్పడినందుకు.

శిబి తన శరీరాన్ని కోసి ఇవ్వాల్సివచ్చింది ఇచ్చిన మాటను నిలబెట్టుకోడానికి. బలి ఈ లోకం ఒదిలి పోవాల్సివచ్చింది. వీళ్ళతో పోలిస్తే మనం ఏమాత్రం? వాళ్ళ పాద రేణువులం కూడా కాదేమో! ఆపద సమయంలో

బొంకులాడచ్చని ధర్మం చెప్పినా వాళ్ళు ఆ అవకాశాన్ని వాడుకోలేదు. మనలా అవకాశవాదులు కాదుకదా. బోనెక్కినపుడు ప్రమాణాలు చేసినా అబద్ధాలు చెప్పి తప్పుకోవాలని చూస్తాం.

తప్పుకోవాలని క్రీస్తు చూసుంటే ఆయన్ను ఎవరూ శిలువ ఎక్కించగలిగి ఉండేవారు కాదు. పిలాతు 'నీవు రాజువా?' అని క్రీస్తును ప్రశ్నించినపుడు – 'నేను రాజునే, కానీ పరలోకానికి,' అన్నాడు. అంతటితో ఊరుకోక సత్యానికి సాక్షిగా పుట్టాను అని కూడా అన్నాడు. 'సత్యం అనగా ఏమిటి?' అని పిలాతు ఎదురు ప్రశ్న వేశాడు. ఆయన ఈ ప్రశ్నకు ఏ సమాధానం ఇచ్చినది బైబిల్చెప్పలేదు – ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు అని మాత్రమే చెప్పింది. మనం ఆ సత్యం అంటే భగవంతుడిగా భావిద్దాము. ఆ సమాధానాలతో సంతృప్తి పడాలో పడకూడదు తెలియని ఒత్తిడికి లోనయిన పిలాతు క్రీస్తును శిలువపాలు చేసి 'ఆ పాపం నాదికాదని,' నీటితో చెయ్యి కడిగేసుకున్నాడు. క్రీస్తు సత్యానికి లేక దేవుడికి సాక్షి అవునో కాదో పిలాతు తేల్చుకోవాలంటే అతగాడికి మరో సాక్షి అవసరం ఒక న్యాయమూర్తిగా. అలా ఆ సాక్షి (క్రీస్తు) చెప్పినది నిజమో కాదో తేల్చడం వీలులేకపోవడం వలన పిలాతు క్రీస్తును రక్షించలేకపోయి ఉండవచ్చు. కాబట్టి ఒకరు చెప్పే సత్యానికి నమ్మదగిన సాక్ష్యం, రుజువు అవసరమవుతాయి.

సత్యవాక్కుతో అనేక బెడదలున్నాయి. అందుచేత ఆ నిప్పుతో మనం దైనందిన జీవితంలో చెలగాటాలాడకూడదు. నాలుక పరంగా చెప్పాలంటే సత్యం రుచి చేదు; అబద్ధంతీయనిది. సత్యాసత్యాలు భార్యలలాంటి జీవిత భాగస్వాములు; పోనీ భర్తలలాంటి భాగస్వాములు. ప్రతి ఒక్కరూ ఇద్దరితో కాపురం చెయ్యాలి. సత్యమనే పరమ పవిత్రమైన భార్య లేక భర్తకన్నా, వేశ్యలాంటి అసత్యం చెంతన గడపడానికి ఇష్టపడతాము. సత్యం పలకడానికి ధైర్యం కావాలి. అసత్యవచనకు అది అక్కరలా. సత్యం పలకడంలో సృజనాత్మకత ఉండదు. అబద్ధాన్ని మన మెదడుతో సృషించాలి. అందుచేత ఎవరన్నా అతి చక్కని, నిర్ భేద్యమైన అబద్ధాన్ని తెలివిగా సృష్టించి చెప్పగలిగితే అనృతమూ జయిస్తుంది. అలా కాక అరకొరగా ఒండిన  అబద్ధాన్ని విస్తరిలో ఒడ్డిస్తే అది ప్రమాదభరితం. ఈ సందర్భంలో ఒక వేమన పద్యాన్ని నేను గుర్తుచెయ్యదలచాను; అదే 'పదుగురాడుమాట పాటియై ధరజెల్లు ..' అదిచెప్పే నీతి ఏమిటి? నలుగురితో బాటు నారాయణా అనమని.  సత్యమని, అసత్యమని మనం ఎప్పుడంటాము? ఏ విషయాన్నన్నా వ్యక్తపరిచినపుడు మౌఖికంగా కానీ రాతపూర్వకంగా కానీ. ఆ రెండు విధాలా ప్రతి ఆలోచననూ వ్యక్తంచేయవలసిన దుర్గతి మానవాళికి దాపురించలేదు. దాపురించి ఉంటే జీవితాన్ని కొనసాగించాలన్న ఇఛ్ఛా చచ్చేది. ఒకరినొకరం చంపుకునేవాళ్ళం. అందువల్ల ఆలోచనా రూపంలో కొన్ని సత్యాలూ, అసత్యాలు గడపదాటకుండా ఉంటాయి. జంతూనాం నరజన్మ దుర్లభం అని మనవాళ్లే నిర్ణయించి మన డప్పు మనకు కొట్టారు. మనం ఆలోచించగల పశువులం; అబద్ధం ఆడగల పశువులం. పశువులకు అబద్ధాలాడి అపరాధభావంతో కృంగిపోవాల్సిన దుర్గతి లేదు మనకంటే అవి ఉన్నతమైనవి కాకపోయినా.

చార్వాకుడు చేసిన ఒక పొరబాటు ఏమిటంటే అక్కడ గుమికూడిన వేలాది బ్రాహ్మలు తరఫున మాట్లాడుతున్నాననడం వాళ్ళు ఆ పెత్తనం అతనికి ఇవ్వకపోయినా. ఏమో, ఇచ్చి మాట మార్చారేమో? సరే ఇచ్చారనే

అనుకుందాం! అబద్ధాన్ని అడ్డుపెట్టుకుని నిప్పులాంటి నిజం పలికాడు. ధర్మరాజును నిలేశాడు: 'నీవు క్రూరుడైన రాజువు. నీ బంధువులను సంహరించావు! నీ జాతిని ఆ విధంగా నిర్మూలించావు; వాళ్ళనేగాక నీ పెద్దలను గురువులను చంపావు; అంతమందిని చంపి రాజుగా నీవు పావుకునేది ఏమిటీ, ఓ కుంతీపుత్రా? నీవు నీ ప్రాణాలు ఒదిలెయ్యడమే సరైన పని,' అన్నాడు. కంగారుతో, సిగ్గుతో కృంగిపోయాడు ధర్మరాజు.'నన్ను శపించకండి; అలాగే త్వరలో మరణిస్తా,' అన్నాడు ధర్మరాజు. రాజు ఇచ్చే సంభావనలకు ఆ సభలో చేరిన అసంఖ్యాక బ్రాహ్మణులు రాజును బాధపెట్టడం ద్వారా నష్టపోతాం అని భావించవచ్చు. అందరూ కలిసి 'హు' అనడం వలన చచ్చాడు. ఒకవేళ చేతులతో కొట్టి చంపే ప్రయత్నంలో వాళ్ళు ఉండటం చూసిన రాజు దాన్ని నివారించే ప్రయత్నం చేసినట్టులేదు. 'రాక్షసుడిగా' దుర్యోధనుడి మిత్రుడిగా పరిగణించబడిన చార్వాకుడూ బ్రాహ్మడే. తమ ప్రతినిధిగా వాడు చెప్పుకున్నాడు కనుక తమ ప్రతినిధి అతగాడు కాదు అని రుజువు చేసుకుని కానుకలను పుచ్చుకోవాలంటే చార్వాకుడిని మట్టుపెట్టటమే సులువైన మార్గంగా వాళ్లకు తోసివుండొచ్చు. అబద్ధమూ, నిజమూ చేతులు కలిపి చార్వాకుడిని పొట్టనపెట్టుకున్నాయి.

ఉపనిషత్తు మైత్రాయణి ఈ ప్రపంచాన్ని ఈసడిస్తుంది ఇలా – స్వప్నం, మాయామయం, భ్రామ్యమాణం, మహాంధకారం, ఇంద్రజాలం, మిథ్యాదర్శనం ... యోగాశిఖ ఇలా అభిప్రాయపడింది – గొడ్రాలికొడుకు, ఎండమావి నీరు, నభోవృక్షం ఎంతటి సత్యమో జగత్తూ అంతటి సత్యం. బ్రహ్మ సత్యం, జగత్తు అసత్యం అన్నది అద్వైతంలో ప్రధానాంశం. ఇంతకూ ఈ సందర్భంలో నేను చెప్పేదేంటంటే అసత్యంలో జీవిస్తూ సత్యాసత్యాల గురించీ ముచ్చటించడం హాస్యాస్పదంకదా?

ఉపన్యాసానంతరం స్వామీ తన అంతరంగ మందిరంలోకి నేల చూపులు చూస్తూ వెళ్లి సింహాసనంలాంటి వాలు కుర్చీలో వాలాడు. కళ్ళు మూసుకుందామ నుకుంటుండగా సేవకుడు భయపడుతూ వచ్చాడు. చేతులుకట్టుకుని ఒంగాడు, తలదించాడు తనకళ్లతో ఆయనను చూసే ధైర్యంలేక. ఉపన్యాసం ఇచ్చిన తరువాత ఒక గంట విశ్రాంతి తీసుకోడం ఆయనకు అలవాటు. బల్ల మీద ఏదో పానీయం ఉంటుంది. దాన్ని సగం వరకు మాత్రమే తాగి కాళ్ళు జాపుకుని, కళ్ళుమూసుకుంటాడు, తాను ఇచ్చిన ఉపన్యాసంలోని విషయాలను మననం చేసుకుంటూ. వాడివైపు ఎలాంటి భావం వ్యక్తం చెయ్యకుండా చూశాడు. కొన్ని భావాలను ఆయన వ్యక్తం చెయ్యకపోయినా అర్థంచేసుకోగల శక్తి ఆయన సేవకులకుంది. ఇప్పుడు నిలబడి ఉన్నవాడు సదాజపుడంతా విశ్వాసపాత్రుడు. గుండెను పైకి పెకిలించుకుని నైవేద్యంగా సమర్పించుకోగల భక్తుడు. తలను కోసి రెండుచేతులతో అర్పించుకోగలడు. స్వామి ఆదేశించాలేగాని ఊపిరిబిగబట్టుకుని దేహంచాలించగలడు. కానీ స్వామి ఎలాంటివాడు? స్వామికే తెలియాలి. ఆయన ఒక బ్రహ్మరహస్యం.

"ఎవరో ఒక స్త్రీ తమ దర్శనానికి వచ్చింది, స్వామీ. కుదరదు అని ఎంతచెప్పినా వినడంలేదు. నన్ను చూస్తే స్వామి నన్ను కాదని పంపలేరు అనింది. దర్శనం సమావేశ మందిరంలో ఐందికదా అన్నాను. ఏకాంతంలో వారి దర్శనం కానిదే ఇక్కడి నుంచీ వెళ్లనని నేలమీద చతికిలపడింది."

"పంపు."

స్త్రీలవిషయంలో జాగ్రత్తగా ఉంటాడాయన. ఎందుకో ఆ మొండిమనిషిని చూసి వెంటనే పంపిద్దామనుకున్నాడు. సాధారణంగా ఏ భక్తుడూ తనను ఏకాంతంలో కలిసే సాహసం చెయ్యడు; చేసినా తాను ఒప్పుకోడు. అతనిలో వైరాగ్యం, నైరాశ్యం ఉన్నాయంటారు భక్తులలో మానసికతత్త్వ వేత్తలు.

మల్లెల వాసనతో ఒక మెరుపు మెరిసింది. రెప్పలు వెంటనే దించేశాడు. ముక్కుపుటలను తాకుతున్న గాఢమైన మల్లెల వాసనను ఏమీ చెయ్యలేక పీలుస్తున్నాడు. అరిషడ్వార్గాలను జయించాలన్న ప్రయత్నం ఆయన చెయ్యలేదు. అసాధ్యమైనపనికి ఎందుకు పూనుకోడం అని అనుకోని ఉండవచ్చు. ఆమె తనను రెప్పవేయకుండా చూస్తుండవచ్చు. క్షణాలలో పంపించెయ్యాలన్న తొందరలో ఉన్నాడు.

"స్వామీ, మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నందుకు క్షమించండి. సత్యం గురించీ మీ ప్రవచనం నన్ను దివ్యలోకాలకు తీసుకెళ్లింది. ఇంతకూ మీ నికరమైన ఉద్దేశం ఏమిటి అన్నది నాలో సందేహంగా మిగిలిపోయింది; బహుశా అది నా మౌఢ్యపు స్థాయిని తెలియజేస్తుందేమో."

"మీరడిగిన ప్రశ్నకు మీ దగ్గిరే సమాధానం ఉన్నపుడు వేరుగా నేను చెప్పవలసిందేముంటుంది?" ఆమె వైపు చూస్తే మహాపాపం అంటుకుంటుందన్నారు దృష్టి మళ్లించకుండా నొసలు చిట్లించి అన్నాడు.

"నేను అజ్ఞానిని కావుననే కదా జ్ఞాన జ్యోతి అయిన మీ చెంతకు వస్తున్నది. సత్యం అన్నదానికి  ఉనికి లేదు, అది కేవలం భావనే అననుకునే ప్రమాదముందా?"

"దేన్నైనా కేవలం భావనే అనుకోడంవలన జరిగే ప్రమాదం అంటూ ఒకవేళ ఉంటె దానివల్ల ఎవరి బుర్రా పగలదు. నేను జ్ఞానజ్యోతినని చెప్పుకునే రకంగానీ, ఇతరులు నా చుట్టూ చేరి తమ తమ అంధకారాలను పారద్రోలుకోండి అని గాని, ఆ పనిచెయ్యడానికి రుసుము వసూలు చెయ్యడం గానీ చెయ్యడం లేదన్న విషయమన్నామీకు తెలిసుండాలి. జీవితం సందేహాస్పదం. మానవుడికి ఆలోచించగలిగిన, అర్థంచేసుకోగలిగిన దానికి పరిమితుంది," అంటూ ఆమె వైపు క్షణం చూపు మళ్ళించాడు.

మెరుపు మెరిసినట్టయింది.తనను పరీక్షించడానికి వచ్చిందా, రొంపిలోకి లాగడానికా?

"మరి స్వాములను ఆశ్రయించడం వృథా అంటారా?"

"అదొక వినోదం కదా? మీరు ఐహికం, ఆముష్మికం అనే జోడుగుర్రాల మీద స్వారీ చేస్తున్నారు. ఏదో ఒక గుర్రాన్ని ఎంచుకోండి," ఆమె దిగేసుకున్న విలువైన నగలు చూస్తూ అన్నాడు,

ఆమె చాలా అందంగా సిగ్గుపడింది, ఉన్న నగలు చాలవన్నట్టు. ఆమె బుగ్గలు లొట్టలుపడ్డాయి వాటిలోకి మనసులను దించి చంపడానికన్నట్టు. స్వామీ దృష్టిని మళ్లించుకున్నాడు.

"విరక్తిని బలవంతాన తెచ్చుకునే ప్రయత్నం చేస్తే ఒస్తుందంటారా?"

"ప్రయత్నంచేయ్యండి."

"అవసరమా?"

"మీకు ఏది అవసరమో మీరే నిర్ణయించుకుంటే మంచింది. జీవితంలో భరించలేని కష్టం వాటిల్లినపుడు తాత్కాలికంగానైనా విరక్తి అదే వచ్చి మిమ్మలను తన ఒళ్ళోకి తీసుకుంటుంది."

"విరక్తి చెందాలంటే కష్టాన్ని కొని తెచ్చుకోవాలంటారా?"

"అనను. కష్టం మీరొద్దన్నా వస్తుంది. కష్టం రాకకై ఎదురు చూడండి."

"మరణానంతరం మరో జన్మంటూ ఉంటే దాన్ని మనకు అనుకూలంగా మలచుకోడానికే కదా ఆధ్యాత్మిక చింతన?"

"మరో జన్మంటూ లేకపోతె ఆ చింతన, అనుభవించే వైరాగ్యం బూడిదెలో పోసిన పన్నీరవుతాయి."

"అలాంటి చింతనలో మనపై మనకు కలిగే గర్వమూ, ఇతరులు మనలను చూసే దృష్టి, వినోదమూ కలవు కదా?"

"లక్ష్యం ప్రధానం కాదనుకున్నపుడు మీరనుకున్నవి ఆ చింతనను వృథా చెయ్యవు."

"సుఖమే జీవిత పరమార్థం అనుకుంటే ఏ సందేహాలకూ, అన్వేషణకూ తావుండదు కదా, స్వామీ?"

"మీ చొప్పదంటు ప్రశ్నలకు నేను సమాధానం ఇవ్వలేను."

"అసహనం స్వాములకు సహజ లక్షణమా, స్వామీ? అహంభావం నిత్యాగ్నిహోత్రం కదూ?"

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS